ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
మంగళవారం 19 మార్చి 2024



తొలిరోజే పరీక్ష..!

గందరగోళంగా హాల్ టిక్కెట్ నంబర్లు
గదులు వెతుక్కునేందుకు విద్యార్థుల తంటాలు
అధికారులపై తల్లిదండ్రుల అసహనం
పదో తరగతి పరీక్షలకు తొలిరోజు 93 శాతం హాజరు

అనంతపురం విద్య, మార్చి 18: పదో తరగతి పరీక్షలు అసౌకర్యాల నడుమ, ఇబ్బందికర వాతావరణంలో మొదలయ్యాయి. పరీక్షా కేంద్రాల్లోని గదుల్లో విద్యార్థుల హాల్ టికెట్ల నంబర్లను సరిగా వేయలేదు. దీంతో ఏ గదిలో, ఎక్కడ కూర్చోవాలో తెలియక విద్యార్థులు గందరగోళానికి గురయ్యారు. సదుపాయాల కల్పన పట్లకూడా జిల్లా విద్యాశాఖ, పరీక్షల విభాగం అధికారులు నిర్లక్ష్యం వహించారు. జిల్లా వ్యాప్తంగా 142 పరీక్షా కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9.45 గంటలకు పరీక్షలు ప్రారంభం కాగా, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉదయం 8 గంటలకే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. దీంతో పరీక్షా కేంద్రాలు కిటకిటలాడాయి. తొలిరోజు విద్యార్థుల్లోనూ, వారి తల్లిదండ్రుల్లోనూ టెన్షన్ కనిపించింది. ఉదయం 9 గంటల వరకూ తమ పిల్లలకు ధైర్యం చెబుతూ తల్లిదండ్రులు పరీక్షా కేంద్రాలవద్దే గడిపారు.

అసౌకర్యాల నడుమ..

అనంతపురం నగరంలోని రాజేంద్రమున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షా కేంద్రం ఏర్పాటుచేశారు. ఇందులో పాత, కొత్త భవన సముదాయాలను వేర్వేరుగా.. ఏ, బీ సెంటర్లుగా విభజించి.. పరీక్షలకు కేటాయించారు. కానీ హాల్ టిక్కెట్ నంబర్లను కలిపి వేశారు. దీంతో అధికారుల తీరుపై విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సెంటర్‌లో పరీక్ష రాసేందుకు భావనా రెడ్డి అనే దివ్యాంగురాలు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో విద్యార్థిని తమ తల్లిదండ్రులు, బంధువుల సాయంతో పరీక్ష రాసేందుకు వచ్చారు. ఉరవకొండ హైస్కూల్‌లోని పరీక్షా కేంద్రంలోని పలు గదుల్లో ఫ్యాన్లు సరిగ్గా తిరగలేదు. దీంతో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


నగరంలోని శారదా మునిసిపల్ స్కూల్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల హడావుడి



ఆల్ ది బెస్ట్ రా.. మామా..


ఇదిగో.. ఇది నీ నంబర్..


ఏం భయం లేదు..
నిదానంగా రాసిరా నాన్నా..


వీల్ చైర్‌లో పరీక్షకు భావనారెడ్డి


అనారోగ్యాన్ని లెక్క చేయకుండా..


పేపర్ ఈజీ.. కుమ్మేశాం..

2,495 మంది గైర్హాజరు

జిల్లా వ్యాప్తంగా తొలిరోజు 2,495 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 31,330 మంది, ప్రైవేట్ విద్యార్థులు 2,744 మంది. మొత్తం 34,074 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 31,579 మంది పరీక్షలకు హాజరయ్యారు. 93 శాతం హాజరు నమోదైంది. నగరంలోని శారదా మున్సిపల్ హై స్కూల్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ గౌతమి తనిఖీ చేశారు. జిల్లా పరిశీలకులు ఆరు కేంద్రాలు, డీఈఓ 3 కేంద్రాలు, ఏసీ ఒక కేంద్రం, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు 31 కేంద్రాలను తనిఖీ చేశారు.



భూగర్భ శోకం..!

- నానాటికీ లోలోతుకు నీరు
- 50 వేలకుపైగా ఎండిన బోరుబావులు
- ఉద్యాన పంటలకు బెట్ట.. తెగుళ్లు
- కాపాడుకునేందుకు అన్నదాత తంటాలు
- ట్యాంకర్ల నీటిని కొని.. పంటకు తడి
- రక్షక తడులతో ఆదుకోవాలని వినతి

అనంతపురం అర్బన్/యాడికి మార్చి 18: కరువు నేలపై పాతాళ గంగ లోలోపలికి వెళుతోంది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా బోరు బావుల్లో నీరు అడుగంటుతోంది. కొన్నిచోట్ల ఇప్పటికే బోర్లు ఎండిపోయాయి. వేసవి సమయం కావడంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. తోట పంటలను కాపాడుకోవడం రైతులకు కత్తిమీద సాములా మారింది. బోరు బావులకింద రబీ సాగు చేసిన పంటలు బెట్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. యాడికి మండలం పచ్చారుమేకలపల్లి, పిన్నేపల్లి గ్రామాల పరిధిలో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. గార్లదిన్నె, పుట్లూరు, కూడేరు, ఆత్మకూరు తదితర మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. దీంతో ఈ ప్రాంత రైతులు అరటి, చీనీ, నిమ్మ, దానిమ్మ తదితర తోట పంటలను కాపాడుకునేందుకు నీటి ట్యాంకర్లను వాడుతున్నారు. కొన్నిచోట్ల పండ్లతోటలు ఎండిపోయాయి. బెట్ట పరిస్థితుల నేపథ్యంలో చీనీ పంటలో వేరుకుళ్లు తెగులు, పొలుసు పురుగుల ఉధృతి ఎక్కువైంది. చీనీ చెట్లు దెబ్బతింటున్నాయి. దీంతో రైతులు భారీగా నష్టపోతున్నారు.

నానాటికీ.. లోలోతుకు..

ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి జిల్లాలో నగటున 461.6 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 293.2 మి.మీ. మాత్రమే నమోదైంది. అంటే 168.4 మి.మీ. లోటు వర్షపాతం నమోదైంది. ఈ నేపథ్యంలో ఏడాది నుంచి ప్రతి నెలా భూగర్భ జలాలు మరింత లోతుకు పోతున్నాయి. 2023 జనవరిలో సరాసరిగా 5.81 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండేవి. ఫిబ్రవరిలో 6.47, మార్చిలో 7.06, ఏప్రిల్‌లో 7.84 , మేలో 7.67 , జూన్‌లో 8.22, జూలైలో 8.53, ఆగస్టులో 9.19, సెప్టెంబరులో 9.51, అక్టోబరులో 9.94, నవంబరులో 10.14, డిసెంబరులో 10.59 మీటర్ల లోతుకు వెళ్లాయి. ఈ ఏడాది జనవరిలో 11.20, ఫిబ్రవరిలో 12.26 మీటర్ల లోతుకు చేరాయి. పరిస్థితి నానాటికీ ఆందోళనకరంగా మారుతోంది.


యాడికి మండలంలో ఎండిపోయిన అరటి పంట

నగరూరులో దారుణం

జిల్లాలో 97 పీజో మీటర్లను వినియోగించి భూగర్భ జలాల స్థాయిని లెక్కిస్తున్నారు. 2023 ఫిబ్రవరిలో జిల్లాలో సరాసరిగా 6.47 మీటర్ల లోతులో నీరు ఉండేదని గుర్తించారు. సరిగ్గా ఏడాది తరువాత.. ఈ ఏడాది ఫిబ్రవరిలో 12.26 మీటర్లలోతుకు పడిపోయాయి. యాడికి మండలం నగరూరులో అత్యధికంగా 37.44 మీటర్ల లోతుకు భూగర్భజలాలు చేరాయి. శెట్టూరు మండలం చెర్లోపల్లిలో 37.12, యాడికి మండలం రాయలచెరువులో 36.36 మీటర్ల లోతులో నీళ్లు ఉన్నాయి. శెట్టూరు మండలంలో 28.07, డి.హిరేహాళ్‌లో 19.67, కణేకల్లు 18.45, కళ్యాణదుర్గం 17.45, రాయదుర్గం 17.42, పుట్లూరు 16.52, బెళుగుప్ప మండలంలో 14.92 మీటర్లలోతులో భూగర్భజలాలు ఉన్నాయి.

ఎండిపోయిన బోర్లు

జిల్లా వ్యాప్తంగా 2.11 లక్షల దాకా బోరు బావులు ఉన్నాయి. వీటిలో 50వేలకుపైగా ఎండిపోయాయి. యాడికి, శెట్టూరు, కళ్యాణదుర్గం, గార్లదిన్నె, పుట్లూరు, బెళుగుప్ప మండలాల్లో ఎక్కువ శాతం బోర్లు ఎండిపోయాయి. మరికొన్ని మండలాల్లోని బోర్లల్లో 50 శాతం నీరు తగ్గింది. ప్రస్తుతం జిల్లాలోని పలు ప్రాంతాల్లో 500 అడగులు, మరికొన్ని ప్రాంతాల్లో వెయ్యి అడుగు లోతు బోరు వేసినా నీరు పడటం లేదు.




పిన్నేపల్లిలో చీనీ మొక్కలను కాపాడుకునే యత్నం

రక్షక తడులేవీ..?

జిల్లా వ్యాప్తంగా 1,25,432 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ఇందులో అరటి 10,701 హెక్టార్లు, చీనీ 38,714, మామిడి 10,323, దానిమ్మ 5,980, సపోట 949 హెక్టార్లల్లో సాగులో ఉన్నాయి. మిగతా విస్తీర్ణంలో ఇతర పంటలు ఉన్నాయి. బోరు బావుల్లో నీరు ఇంకిపోవడంతో ఉద్యాన పంటలు ఎండిపోతున్నాయి. ఉద్యాన శాఖ రాష్ట్ర ఉన్నతాధికారుల బృందం ఇటీవల రెండు రోజుల పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించింది. ఎండిపోయిన, ఎండుతున్న పంటలను కళ్లారా చూసింది. ఉన్న నీటిని జాగ్రత్తగా వాడుకోవాలని ఉచిత సలహా ఇచ్చి వెళ్లింది. అంతేగానీ, పంటలను కాపాడేందుకు రక్షక తడులు ఇవ్వాలని ప్రభుత్వానికి ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదు. టీడీపీ హయాంలో కరువు సమయాలలో ఉద్యాన పంటలకు ప్రభుత్వం ఉచితంగా ట్యాంకర్ల ద్వారా నీటిని అందించి ఆదుకుంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ దిశాగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కళ్లెదుటే తోటలు ఎండిపోతుండటంతో కొందరు రైతులు అప్పు చేసి ట్యాంకర్ల ద్వారా తడులు అందిస్తున్నారు. పంటలను కాపాడుకునేందుకు తంటాలు పడుతున్నారు.

ట్యాంకర్లతో నీరు..



అరు నెలల క్రితం 3 ఎకరాల్లో చీనీ మొక్కలు నాటాను. రెండు బోర్లల్లో రెండున్న ఇంచుల చొప్పున నీరు వచ్చేది. రెండు నెలుగా రెండు బోర్లలో నీరు రావడం లేదు. దీంతో ట్యాంకర్ల ద్వారా నీరు తెచ్చి చీనీ మొక్కలను కాపాడుకుంటున్నాము. పంటలు ఎండిపోకుండా రక్షక తడులు అందంచి ప్రభుత్వం ఆదుకోవాలి. లేదంటే చీనీ మొక్కలను బతికించుకోవడం కష్టమే.

- మహేష్, పిన్నేపల్లి, యాడికి మండలం

అరటి తోట ఎండిపోయింది



ఐదెకరాల్లో రెండేళ్ల క్రితం అరటి పంట పంట సాగు చేశాను. ఈ సారి కోత సమయంలో బోరులో నీరు ఆగిపోయింది. అరటి పంట నిట్ట నిలువున ఎండిపోయింది. ఇంతకు ముందు కోతల్లోనూ బోరులో నీరు తక్కువగా రావడంతో పంటకు సరిపడా నీరు అందించలేకపోయాం. అరటి దిగుబడి తగ్గింది. ఎకరానికి 4 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. ఈ సారి భారీగా నష్టం వచ్చింది. బీమా పరిహారం అందించి ప్రభుతమే ఆదుకోవాలి.

- రామ్మోహన్, పచ్చారుమేకలపల్లి, యాడికి మండలం

బోరు ఎండిపోయింది

రెండున్నర ఎకరాలలో మొక్కజొన్న సాగు చేశాను. రెండు నెలలుగా బోరు బావి ఎండిపోయి చుక్కనీరు రావడం లేదు. సమీప పొలం రైతుల బోరు బావి నుంచి డబ్బులు వెచ్చించి మొక్కజొన్నకు తడులు అందించాను. అయినా నీటి కొతర తలెత్తింది. వారం రోజుల క్రితమే కోత కోశాను. తడులు సరిగా ఇవ్వనందున దిగుబడి తగ్గి నష్టపోయాం.



- రామాంజనేయులు, పచ్చారుమేకలపల్లి, యాడికి మండలం

మరింత లోతుకు వెళ్లే ప్రమాదం..

2023-24 సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లల్లో వర్షాభావంతో భూగర్భజలాలు తగ్గాయి. వేసవి నేపథ్యంలో మరింత లోతుకు భూగర్భజలాలు వెళ్లే ప్రమాదం ఉంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో బోర్లల్లో పూర్తిగా నీరు ఇంకిపోయింది. నాలుగేళ్ల క్రితం జిల్లాలో బాగా వర్షాలు పడటంతో బోర్లన్నీ రీచార్జ్ అయ్యాయి. ఏడాది కాలంగా వర్షాలు పడకపోవడంతో భూగర్భ జలాలు తగ్గిపోయాయి. వచ్చే నెలలో మరింత లోతుకు వెళ్లే ప్రమాదం ఉంది.

- తిప్పేస్వామి, భూగర్భజల శాఖ డీడీ

వైసీపీ పతనం ఖాయం: కాలవ



అనంతపురం అర్బన్, మార్చి 18: ప్రజాగళం సభ గ్రాండ్ సక్సెస్ అయ్యిందని, టీడీపీ-బీజేపీ-జనసేన కూటమి చేతిలో వైసీపీ పతనం ఖాయమని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ రెడ్డి అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజాగళం కూటమి సభ నిర్ణయించిందని తెలిపారు. దీనికి ప్రజాగళం సభకు హాజరైన లక్షలాది మంది జనం మద్దతు తెలిపారని అన్నారు. నియంత జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్ సర్వనాశనం అయ్యిందని అన్నారు. వైసీపీ, కాంగ్రెస్ పార్టీలకు ఒకే కుటుంబానికి చెందిన వారు ఏపీలో సారథ్యం వహిస్తున్నారని అన్నారు. జగన్ పాలన అవినీతికి మారుపేరుగా మారిందని విమర్శించారు. ఇప్పటికే కలెక్టరేట్‌లు, రైతు బజార్ భవనాలు, ప్రభుత్వ కళాశాలలతోపాటు అనేక ప్రభుత్వ ఆస్తులను వైసీపీ ప్రభుత్వం తనఖా పెట్టిందని అన్నారు. వైసీపీ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, రాబోవు ఎన్నికల్లో ఓటుతో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

అనంత బరిలో సీపీఐ


మాట్లాడుతున్న జగదీశ్

అనంతపురం విద్య, మార్చి 18: అనంతపురం అర్బన్ నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థి బరిలో ఉంటారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీశ్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో.. జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి నారాయణస్వామితో కలసి సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. అర్బన్ అభ్యర్థిగా సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి నారాయణస్వామి పేర్లను ప్రతిపాదిస్తూ పార్టీ రాష్ట్ర శాఖకు పంపించామని తెలిపారు. ఎన్నికల్లో కలసి వచ్చే కాంగ్రెస్, సీపీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన అన్నారు.

ఉష్ణోగ్రతలు (సోమ)
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 26.0





ఇఫ్తార్	: మంగళవారం సాయంత్రం 06:33
సెహరీ	: బుధవారం ఉదయం 05:02

నిరంతరం పర్యవేక్షించాలి: కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి 18: కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కమాండ్ కంట్రోల్ రూమ్‌ను కలెక్టరు గౌతమి సోమవారం తనిఖీ చేశారు. ఫిర్యాదుల యూనిట్, 1950 కాల్ సెంటర్, ఖర్చుల పర్యవేక్షణ తదితర విభాగాలను ఆమె పరిశీలించారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఇక్కడి నుంచి నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారుల నుంచి నివేదికలను సకాలంలో తెప్పించుకోవాలని అన్నారు. నోడల్ అధికారుల ఫోన్ నంబర్లను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పర్యవేక్షణ జరగాలని, సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. మీడియాలో వ్యతిరేక కథనాలు వస్తే.. ఎప్పటికప్పుడు నివేదిక అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ కేతన్ గార్గ్, జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా, డీఆర్ఓ రామక్రిష్ణారెడ్డి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.


ఎన్నికల కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

బసవేశ్వర వాహనోత్సవం


బసవేశ్వరవాహనంపై దర్శనమిస్తున్న స్వామి వారు

ఉరవకొండ, మార్చి 18: పట్టణంలోని గవిమఠస్థిత చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి బసవేశ్వర వాహనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారిమూల విరాట్టును అభిషేకించి, పూజించారు. ఉత్సవమూర్తిని మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి బసవేశ్వర వాహనంపై కొలువుదీర్చి, భక్తులకు దర్శనం కల్పించారు. గవిమఠం నుంచి ఎదురుబవన్న గుడి వరకూ ఊరేగించారు. వేడుకల్లో పీఠాధిపతి చెన్నబసవ రాజేంద్రస్వామి, ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి, ఆదోని చౌకిమఠం కల్యాణ్ స్వామి, గవిమఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

మరో చాన్స్

ఏప్రిల్ 15 వరకు ఓటరు నమోదుకు అవకాశం



పుట్టపర్తి, మార్చి 18: సార్వత్రిక ఎన్నికలు ఆలస్యం కావడంతో కొత్తఓటర్లకు ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఎన్నికల కమిషన్ మరో సారి అవకాశం కల్పించింది. గతంలో జనవరి 1 2024 వరకు 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కు నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. అయితే ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండటంతో దాన్ని ఏప్రిల్ 15 వరకు పొడిగించారు. అవసరమైన వారు ఫారం-6 ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. యువత ఆన్‌లైన్ ద్వారా లేదా ఆయా మండల కేంద్రాలలో ఎన్నికల అధికారులకు ఫారం-6ను అందజేయాల్సి ఉంటుంది. వీటిని పరిశీలించి ఏప్రిల్ 25లోగా కొత్త ఓటరుగా నమోదు చేస్తారు.

యువతకు అవకాశం కల్పించేందుకే..

కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కు కల్పించేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం ఇచ్చింది. జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు నాల్గవ విడతలో జరుగుతుండటంతో కొత్తగా అర్హులైన వారు ఏప్రిల్ 15లోగా ఫారం-6 ద్వారా నమోదు చేసుకోవాలి. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఏప్రిల్ 25లోగా అర్హులైన వారికి ఓటు హక్కు కల్పిస్తాం.



కొండయ్య, డీఆర్వో

యువ ఓటర్లు 26 వేల మంది

ఇప్పటికే జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు కొత్తగా ఓటు హక్కును కల్పించారు. వీరు 26వేలకుపైగా ఉన్నారు. మొదటి సారి ఈఏడాది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

చేర్పులు, మార్పులు లేవు

ప్రస్తుతం కొత్తగా ఓటు నమోదుకు మాత్రమే అవకాశం ఉంది. చేర్పులు, మార్పులకు ఎలాంటి అవకాశం లేదు. ఫారం-7, ఫారం-8 ద్వారా తొలగింపులు, మార్పులు, చేర్పులు చేసేవారు. ప్రస్తుతం కేవలం ఫారం-6 ద్వారా కొత్తగా ఓటు హక్కుకు మాత్రమే అవకాశం కల్పించారు.

సారూ..! రోంత జాగర్త

- ఎన్నికలవేళ కోడ్ అమలు
- పార్టీలకు ప్రచారాలు చేస్తే కుదరదు
- ఉద్యోగుల సామాజిక మాధ్యమాలపై నిఘా



అనంతపురం టౌన్, మార్చి 18 : ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. సార్వత్రిక ఎన్నికలు వచ్చేశాయి. కోడ్ కూసింది. ఇప్పటివరకు ఉద్యోగుల పరిస్థితి ఒకలెక్క.. ఇప్పటి నుంచి మరోలెక్కలా ఉంటుంది. గతంలో తమకు ఇష్టమొచ్చినట్లు రాజకీయ పార్టీలకు మద్దతుగా మాట్లాడి ఉండవచ్చు. వారికి మద్దతుగా వ్యవహరించి ఉండవచ్చు.. కానీ ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చేసింది. ఇప్పుడు అవన్నీ కుదరవు. గతంలో మాదిరిగా ప్రభుత్వ ఉద్యోగులు తమ అభిప్రాయాలను ఇష్టారాజ్యంగా ప్రచారం చేస్తామంటే కుదరదని ఎన్నికల నిబంధనలు చెబుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులతో పాటు ప్రభుత్వ జీతాలు పొందే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సైతం పార్టీలకు మద్దతుగా ప్రచారం చేయకూడదు. సామాజిక మాధ్యమాలలోకూడా తమ అభిప్రాయాలను పోస్టు చేయకూడదు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.

అధికార పార్టీకి అనుకూలంగా ఐకేపీ, డ్వామా ఉద్యోగులు, వలంటీర్లు

జిల్లాలో కొందరు అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. అధికార వైసీపీకి వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ఐకేపీ, డీఆర్‌డీఏ, డ్వామా ఉద్యోగులు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులతో వెళ్లడంతో పాటు వారికి ఓటువేయాలని ప్రచారం చేస్తున్నారు. రాయదుర్గం, ఉరవకొండ, శింగనమల, రాప్తాడు, తాడిపత్రి నియోజకవర్గాల్లో ఐకేపీ, డ్వామా ఉద్యోగులు, వలంటీర్లు స్వయంగా పాల్గొని వైసీపీకి ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారు. సమావేశాలుపెట్టి బెదిరిస్తున్నారని కూడా వెలుగులోకి వస్తున్నాయి. ఆయా శాఖల ఉన్నతాధికారుల సహకారం, అండ ఉండడం వల్లనే వారు బరితెగించి ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్న ప్రచారం ఉద్యోగ వర్గాల్లో సాగుతోంది. వలంటీర్లకు ప్రభుత్వమే జీతాలు ఇస్తోంది కాబట్టి వారుకూడా ఎన్నికల నిబంధనలకు లోబడి ఉండాలి. కానీ అధికార వైసీపీ ఏజెంట్లుగా వ్యవహించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఎన్నికల విధులకు వలంటీర్లను వినియోగించుకోకూడదని ఇప్పటికే ఎన్నికల కమిషన్ స్పష్టం చేసినా వారిని నియంత్రించే అధికారులు కనిపించడంలేదు.

ఎన్నికల కమిషన్ ప్రత్యేక నిఘా

ఉద్యోగుల విషయంలో ఎన్నికల కమిషన్‌కు ఇప్పటికే అనేక ఫిర్యాదులు వెళ్లాయి. కొందరిపై ఆధారాలతో సహా ప్రతిపక్షాలు ఫిర్యాదులు చేశాయి. కానీ అధికార పార్టీ నేతలు తామున్నామంటూ హామీలు ఇవ్వడంతోపాటు ఉన్నతాధికారులు సైతం మౌనంగా ఉండిపోతుండడంతో ఐకేపీ, డ్వామా, వలంటీర్ల వ్యవహారాలు మితిమీరిపోయాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నేరుగానే కాదు పరోక్షంగా రాజకీయ పార్టీలకు ప్రచారాలు చేసినా, తమ అభిప్రాయాలను సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా చర్యలు ఉంటాయని ఎన్నికల నిబంధనలు చెబుతున్నాయి. ఎన్నికల కమిషన్ కూడా ఉద్యోగుల విషయంలో ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఓ ఉన్నతాధికారి తెలిపారు. రాబోయే రెండు నెలల పాటు ఉద్యోగులు జాగ్రత్తగా ఉండకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఎన్నికల కమిషన్ రాష్ట్ర ప్రధానాధికారి ముఖేష్‌కుమార్‌మీనా హెచ్చరించిన విషయం విదితమే.

నేటి నుంచి ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు



స్వాగత తోరణాలు

కదిరి, మార్చి 18: ప్రసిద్ధిగాంచిన ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అంకుర్పారణతో మొదలై ఏప్రిల్ 2న పుష్పయాగోత్సవంతో ముగుస్తాయి. పక్షం రోజులపాటు కాటమరాయుని తిరునాళ్లను కన్నులారా చూసేందుకు కదిరి ప్రాంతంనుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాలతోపాటు కర్ణాటక రాష్ట్రం నుంచి లక్షలాదిమంది తరలివస్తారు. బ్రహోత్సవాలకు ప్రతి సంవత్సరం భక్తులు ముడుపులు కట్టి, వేచి చూస్తుంటారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్యంగా కల్యాణోత్సవం, మోహినోత్సవం, గరుడసేవ, బ్రహ్మ రథోత్సవం, తీర్థవాది ముఖ్యమైనవి. ఈఉత్సవాల్లో ప్రతిరోజు వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు.

ఏర్పాట్లు పూర్తి: శ్రీనివాసరెడ్డి, ఈఓ

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. భక్తులకు మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీరు, ఉచిత భోజన సదుపాయాన్ని ఆలయంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఎన్నికల ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్

చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డిమాండ్



వైసీపీ ఎన్నికల ప్రచారంలో వెస్టునరసాపురం ఫీల్డ్ అసిస్టెంట్ పట్నం భాస్కర్ (వృత్తంలో వ్యక్తి)

శింగనమల, మార్చి 18: వైసీపీ తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న వెస్టునరసాపురం ఫీల్డ్ అసిస్టెంట్ పట్నం భాస్కర్‌పై ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని శింగనమల టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ కోరారు. మండలంలోని చిన్న జలాలపురం గ్రామానికి చెందిన పట్నం భాస్కర్ వెస్టునరసాపురం ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఉన్నాడు. పుట్లూరు మండలంలో శనగలగూడురు, తిమ్మాపురం, వి.చింతలపల్లి, గోవరాజుపల్లి, సి.యంగన్నపల్లి గ్రామాల్లో జరిగిన ఎన్నిక ప్రచారంలో వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులు, ఎంపీ అభ్యర్థి శంకర్ నారాయణ ప్రచారం చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు విరుద్ధంగా ఆ ఫీల్డ్ అసిస్టెంట్ వారి తరపున ప్రచారం చేశాడన్నారు. దీనిపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు.

వైసీపీ కార్యక్రమంలో వలంటీర్



శింగనమలలో జరిగిన వైసీపీ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్ వెంకటేశ్

శింగనమల, మార్చి 18: ఎన్నికల అధికారులు పదే పదే చెబుతున్నా గ్రామ వలంటీర్లు వైసీపీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటూనే ఉన్నారు. శింగనమలలో రామస్వామి దేవాలయలో వైసీపీలో పదవులు పొందిన నాయకులకు సన్మాన కార్యాక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్న జలాలపురం గ్రామానికి చెందిన వలంటర్ వెంకటేశ్ పాల్గొని వారిని సన్మానించాడు.

రైళ్లలో జీఆర్పీ ఎస్పీ తనిఖీలు

గుంతకల్లు, మార్చి18: వేసవి ప్రారంభం కావడంతో జీఆర్పీ ఎస్పీ సోమవారం గుంతకల్లు-నంద్యాల సెక్షన్‌లో విస్తృత తనిఖీలను నిర్వహించారు. ఉదయం గుంతకల్లు స్టేషన్ మొదలుకుని డోన్, నంద్యాల స్టేషన్లలోనూ, రైళ్లలోనూ అనుమానాస్పదంగా కనిపించిన ప్రయాణికులను ప్రశ్నించారు. లగేజిని తనిఖీచేశారు. కిటికీల వద్ద ఉన్న మహిళా ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలని, తమ లగేజిని జాగ్రత్త చేసుకోవాలని, అపరిచితులతో మాటలు కలపరాదని, వారిచ్చే తినుబండారాలను తీసుకోరాదని తెలిపారు. తిరుగు ప్రయాణంలో కర్నూలుకు వెళ్లి రైళ్లు, స్టేషన్లలో తనిఖీలను నిర్వహించారు. కార్యక్రమంలో జీఆర్పీ సిబ్బంది, ఎస్పీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోడ్ వేళ జడ్పీలో బదిలీల గోల

- తాజాగా నలుగురు ఉద్యోగులకు స్థానచలనం
- ఎన్నికల కోడ్ రావడానికి ముందే ఉత్తర్వులు
- ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటకు
- బుసలు కొడుతున్న జిల్లా బ్యూరోక్రసీ



అనంతపురం విద్య, మార్చి 18: జిల్లా పరిషత్‌లో ఎన్నికల కోడ్ వేళ అనూహ్యంగా అధికారులు, ఉద్యోగుల డెప్యుటేషన్లు, వర్క్ అడ్జస్టమెంట్ పేరుతో బదిలీల వ్యవహారం నడుస్తోంది. ఉన్నఫలంగా జడ్పీ నుంచి కొందరిని బయటకు పంపడం, మరికొందరిని జడ్పీకి తేవడం, పైగా కోడ్ వచ్చిన వెంటనే వేగంగా ఉత్తర్వులు బయటకు వస్తుండటంపై అనేక విమర్శలు వస్తున్నాయి. అయితే ఈ బదిలీల వ్యవహారం మొత్తం ఎన్నికల కోడ్ రావడానికి ముందే నడిచినా...ఉత్తర్వుల కాపీలు మాత్రం కోడ్ కూసిన తర్వాత రావడం చర్చనీయాంశంగా మారింది. రెండు రోజుల కిందట డిప్యూటీ సీఈఓని బదిలీ చేసి...కొత్త అధికారిని నియమించారు. ఇటీవల పాలకవర్గం సభ్యులు ఆమెను సరెండ్ చేయాలని డిమాండ్ చేయడంతో... గుంతకల్లు డీఎల్‌డీఓగా డెప్యుటేషన్‌పై కలెక్టర్ పంపారు. అదే అనూహ్యం అనుకుంటుంటే జడ్పీ పరిధిలోని మరో నలుగురు అధికారులను ఉన్నఫలంగా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి పని సర్దుబాటు (వర్క్ అడ్జస్ట్‌మెంట్) కింద బదిలీ చేస్తూ.. జడ్పీ సీఈఓ ఈనెల 15న ఉత్తర్వులు జారీ చేశారు. జడ్పీలోని అడ్మిని స్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో) షబీర్ నియాజ్‌ను శెట్టూరు ఎంపీడీఓ ఆఫీస్‌కు, పామిడిలోని అడ్మిని స్ట్రేటివ్ ఆఫీసర్ హరనాథ్‌ను జడ్పీ కార్యాలయానికి, జడ్పీలోని సీని యర్ అసిస్టెంట్ శ్రీనివాసులును అమరాపురం ఎంపీడీఓ ఆఫీస్‌కు, పుట్టపర్తి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (పీఐయూ) ఆఫీస్‌లోని సీనియర్ అసిస్టెంట్ కేశవ్‌ను జడ్పీ కార్యాలయానికి వర్క్ అడ్జస్టమెంట్ కింద బదిలీ చేశారు.

మరికొందరిపై వేటు తప్పదా..?

జడ్పీలో మరికొందరిపై వేటు వేయడం ఖాయం అన్నట్లు సమాచారం. గత కొంతకాలంగా జడ్పీ పాలకవర్గం వర్సెస్ జిల్లా బ్యూరో క్రసీ అన్నట్లుగా సాగుతోంది. ఈ క్రమంలో ఇన్నాళ్లు పాలకవర్గంలోని కీలక నేతలు, జడ్పీటీసీ సభ్యులు తమను జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు, సర్వసభ్య సమావేశాల్లో టార్గెట్ చేశారని ఇప్పుడు ఎన్నికల కోడ్ వచ్చిం దని...ఇక తామేంటో చూపిస్తాం అన్నట్లుగా జిల్లా బ్యూరోక్రసీ తమ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే తమ పంతం నెగ్గించుకోవడంలో భాగంగా...జడ్పీ నుంచి కొందరు అధికారులను సుదూర ప్రాంతాలకు బదిలీ చేయడం, మరికొందరికి జడ్పీకి తీసుకొచ్చినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా ఇన్నాళ్లు ఉద్యోగుల పక్షాన, బ్యూరోక్రసీకి వ్యతిరేకంగా గళం విప్పిన ఇతర అధికారులపై వేటు వేసేందుకు యత్నాలు సాగుతున్నట్లు సమాచారం. బుసలు కొడుతున్న బ్యూరోక్రసీ త్వరలో జడ్పీలోని మరికొందరిపై కూడా బదిలీల వేటు వేయడం ఖాయం అంటూ జడ్పీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. మరి తర్వాత వచ్చే లిస్టులో ఎవరెవరు ఉంటారో అం టూ... కొందరు ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

చిరుత మృతి



చిరుత కళేబరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 18 : శెట్టూరు మండలం ఐదుకల్లు గ్రామ సమీపంలోని దుప్పర్లగుట్టలో అనుమానాస్పద స్థితిలో చిరుత మృతి చెందింది. ఈ విషయాన్ని గమనించిన గొర్రెల కాపరులు గ్రామస్థులకు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వేసవికాలం మొదలైన నేపథ్యంలో అటవీ ప్రాంతంలో తాగునీరు లభించక, ఎండవేడిమితో చనిపోయి ఉండవచ్చని చెబుతున్నారు. చిరుత మృతి చెంది దాదాపుగా ఎనిమిది రోజులైనట్లు అటవీశాఖ అధికారులు వెల్లడించారు. చిరుత మృతి పై అటవీశాఖ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. అనారోగ్యంతోనా లేక తాగునీరు లేక మృతి చెందిందా అనే పూర్తి సమాచారం ఫోరెన్సిక్ రిపోర్ట్‌లో తేలనుందని అటవీశాఖ అధికారులు తెలిపారు.

వ్యాపారవేత్తపై హత్యాయత్నం



గోపాలకృష్ణను పరామర్శిస్తున్న టీడీపీ నాయకుడు ఈరన్న

మడకశిరటౌన్, మార్చి 18: పట్టణానికి చెందిన కొందరు తనపై సోమవారం రాత్రి వేటకొడవళ్లతో దాడిచేసి హత్యకు యత్నించినట్లు పట్టణానికి చెందిన వ్యాపారవేత్త గోపాలకృష్ణ తెలియజేశారు. బాధితుడు తెలిపిన మేరకు పట్టణ సమీపంలోని మధుగిరిరోడ్డు మారుతీనగర్‌లో ప్రధాన రహదారి పక్కన తనకు కొంత భూమి ఉందన్నారు. అందులో వేరుశనగ కాయల మిల్లు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ఆరేళ్ల కిందట రెవెన్యూ శాఖలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కొందరు ఉద్యోగులు తన పట్టా భూమిలో దాదాపు 22 సెంట్లకు వన్- బీ చేయించి ఓ వ్యక్తికి ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ ఇచ్చారు. ఈ విషయమై కోర్టును ఆశ్రయించాన న్నారు. ఆ వ్యక్తి సోమవారం రాత్రి ఉన్నట్టుండి కొందరు వ్యక్తులతో కలిసి వచ్చి స్థలాన్ని ఆక్రమించుకోవడానికి గేటు ఏర్పాటు చేశాడన్నారు. విషయం తెలుసుకుని అడ్డుకోవడానికి వెళ్లిన తనపై కొడవలి, రాడ్లతో దాడి చేశారన్నారు. దాడిలో గాయపడిని తనను వేరుశనగ మిల్లులో పనిచేసే కూలీలు మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుడి తలకు బలమైన గాయాలు కావడంతో బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు మద్దనకుంట ఈరన్న మడకశిర ప్రభుత్వాస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. గోపాలకృష్ణ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మనోహర్ తెలిపారు.

ఈవీఎంలు పరిశీలించిన కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి 18: జిల్లా కేంద్రంలోని పాత ఆర్డీఓ కార్యాలయం కాంపౌండ్‌లోని గోదాంలో భద్రపరిచిన ఈవీఎంలను కలెక్టరు గౌతమి సోమవారం పరిశీలించారు. నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డితోపాటు పలుపార్టీల ప్రతినిధులతో కలిసి గోదాం తాళాలు తీయించారు. అనంతరం శ్రీసత్యసాయి జిల్లా నుంచి వచ్చిన 98 ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బెల్ కంపెనీ నుంచి వచ్చిన ఇద్దరు ఇంజనీర్ల పర్యవేక్షణలో ఈచెకింగ్ చేపట్టారు. ఎన్నికల నిబంధనల ప్రకారం సజావుగా చెకింగ్ కార్యక్రమం చేపట్టాలని కలెక్టరు ఆదేశించారు. అలాగే ఇతర ఈవీఎంలు వాటిభద్రతను ఆమె పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.



గోదాంలో పరిశీలిస్తున్న కలెక్టరు గౌతమి తదితరులు

ఇన్నాళ్లకు గుర్తొచ్చానా ?



గుంతలపై తోలిన ఎర్రమట్టి

కణేకల్లు, మార్చి 18: మండలంలోని కొత్తపల్లి రహదారి మరమ్మతుల గురించి ఇన్నాళ్లకు గుర్తొచ్చినట్లు ఉంది. ఐదేళ్లుగా ఈ రహదారి గుంతలతో కూడి ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అప్పుడు ఏ నాయకుడు పట్టించుకోలేవు. ఇప్పుడు ఏమి బుద్ధి పుట్టిందో ఏమో గుంతల రోడ్డుపై మట్టి తోలుతున్నారు. కొత్తపల్లికి చెందిన వైసీపీ నాయకుడు సోమవారం ట్రాక్టర్ ద్వారా గుంతలమయ మైన రోడ్డుకు యర్రమట్టిని తోలించాడు. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలపై కపట ప్రేమను చూపుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలి

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 18 : తెలుగు రాష్ట్రాల్లో నిరుపేదలకు 50 సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ వెంటనే రెన్యువల్ చేయాలని రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు నాగరాజు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం ఎదుట ఆయన ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆర్డీటీని సమష్టిగా పోరాడి కాపాడుకుందామని కోరారు. విదేశాల నుంచి దాతలు అందిస్తున్న విరాళాల సేకరణకు అనువుగా ఫారిన్ కంట్రిబ్యూటరీ రెగ్యులేటరీ యాక్ట్ (ఎఫ్‌సీఆర్‌ఏ)ను కేంద్రప్రభుత్వం వెంటనే రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం రెన్యువల్ చేసే కేంద్రప్రభుత్వం... ఈ ఏడాది ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయకుండా నిలపడం దారుణమన్నారు. రాయలసీమతో పాటు తెలంగాణలో సైతం సేవలందిస్తున్న ఆర్డీటీ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు వేలాది కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నూర్ మహ్మద్, ఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకులు సాకే హరి, ఏఐఎంఎస్ జిల్లా కన్వీనర్ పుల్లయ్య, ఏపీడబ్ల్యూజేయూ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి, ఆశ్రయ సంస్థ కృష్ణారెడ్డి, మాలమహానాడు గంగాధర్, బీసీ సంఘం హరి, ఎస్ఎస్‌యూఐ నరేష్, సమాజ్‌వాది పార్టీ బాబా, ఆర్‌ఈఎఫ్ శ్రీరాములు, నాయకులు ఓబుళపతి, రాజ్‌కుమార్, అమర్, అనీల్, మల్లికార్జున, వెంకటనారాయణ, మల్లేష్, రాజు మద్దతుగా పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

బత్తలపల్లి, మార్చి 18: మండలకేంద్రం సమీపంలోని నార్శింపల్లికి వెళ్లే దారిలో విద్యుదాఘాతంతో శ్రీరాములనాయుడు (30) ట్రాన్స్‌ఫార్మర్‌పైనే మృతి చెందాడు. ఎస్‌ఐ తెలిపిన మేరకు బత్తలపల్లికి చెందిన రైతు వెంకటనారాయణ వ్యవసాయ తోట వద్ద ట్రాన్స్‌ఫార్మర్ స్తంభంపై సోమవారం సాయంకాలం శ్రీరాములనాయుడు మృతదేహం వేలాడుతూ రైతుకు కనిపించింది. ఆయన వెంటనే పోలీసులు, ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఎస్‌ఐ శ్రీనివాసులు ట్రాన్స్‌కో ఏఈ శివయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహన్ని కిందకు దింపారు. మృతుడిపై ఉన్న చొక్కా జేబును పరిశీలించగా స్పానర్, ఆక్సాబ్లేడ్ దొరికాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్ దొంగిలించేందు మృతుడితో పాటు మరి కొందరు వచ్చి ఉంటారని పోలీసులు, ట్రాన్స్‌కో అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడు పుట్టపర్తి మండలం ఎనుములపల్లి గ్రామానికి చెందిన సంజీవనాయుడు కుమారుడు శ్రీరాములనాయుడుగా పోలీసులు గుర్తించారు. మృతుడికి భార్య పుష్ప, ఇద్దరు కుమారులు ఉన్నరు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యప్తు చేస్తున్నారు.

తాగునీటి సమస్య తీర్చాలంటూ మహిళల ఆందోళన



రోడ్డుపై ఖాళీబిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

కళ్యాణదుర్గం, మార్చి 18: తాగునీటి సమస్య తీర్చాలంటూ రోడ్డుపై ఖాళీ బిందెలతో పలువురు మహిళలు ఆందోళనకు దిగారు. కంబదూరు మండలంలోని అండేపల్లి గ్రామంలో సోమ వారం మహిళలందరూ ఖాళీబిందెలు చేతపట్టి రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేపట్టారు. రోడ్డుపై ముళ్లకంపలు వేసి వాహనాలను ఆపివేశారు. సుమారు గంటపాటు రోడ్డుపై బైఠాయించి ఆందో ళన చేపట్టడంతో వాహనాలన్నీ నిలిచిపోయాయి. గత కొన్ని నెలల నుంచి గ్రామంలో తాగునీటి కష్టాలు వున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మహిళలతో సమస్యను అడిగితెలుసుకున్నారు. నీటి సమస్యను పరిష్కరించేంత వరకు ఆందోళన విరమించేది లేదని పోలీసులతో మహిళలు వాదించారు. చివరికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరిస్తామని తెలపడంతో వారు ఆందోళన విరమించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

గుత్తి, మార్చి 18: పట్టణ శివారులో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి 820గ్రాముల గంజాయిను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెంకటరామిరెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ పట్టణ శివారులోని కొత్తపేట బ్రిడ్జి సర్వీసు రోడ్డులో ఇరువురు వ్యక్తులు గంజాయి అమ్ముతున్నారని సమాచారం మేరకు తాను, ఎస్‌ఐ నబీ రసూల్, సిబ్బందితో దాడులు నిర్వహించి గంజాయి అమ్ముతున్న పట్టణంలోని ఎస్సీకాలనీకి చెందిన సూరిపోగుల సాయికుమార్, వడ్డెవిజయ్ అలియాస్ బెగ్గర్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 820 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు.

ఉద్యోగాలకు 35 మంది ఎంపిక

అనంతపురం సెంట్రల్, మార్చి 18 : క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ ద్వారా 35మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు శ్రీచైతన్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణరెడ్డి తెలిపారు. సోమవారం గుత్తిరోడ్డులోని కళాశాలలో బెంగుళూరు అల్‌సెక్ టెక్నాలజీస్ సంస్థ ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థులకు నియామక పత్రాలందజేశారన్నారు.

వరిగడ్డి, వేరుశనగ కట్టె దగ్ధం

రాప్తాడు, మార్చి 18: రాప్తాడులో రైతు తలారి గోవిందుకు చెందిన వరిగడ్డి, వేరుశనగ పొట్టు దగ్ధమైంది. రాప్తాడులో జాతీయ రహదారి పక్కన తలారి గోవిందు పాడి పశువులు మేపుకుంటూ జీవనం సాగించేవాడు. గడ్డివాముల సమీపంలో పైభాగాన విద్యుత్ తీగలు ఉండటంతో షార్ట్ సర్క్యూట్ అయినప్పుడు నిప్పు రవ్వలు చెలరేగి గడ్డివాములు అంటుకున్నాయి. రెండు ట్రాక్టర్ల వేరుశనగ పొట్టు, రెండు ట్రాక్టర్ల వరిగడ్డి కాలిపోయాయి. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు మంటల ఆర్పేందుకు విఫలయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి... మంటలు ఆర్పింది. దాదాపు రూ. లక్షకు పైగా నష్టపోయినట్లు రైతు తెలిపాడు. విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని, పక్కకు మార్చమని విద్యుత్ శాఖ అధికారులకు పలు మార్లు చెప్పినా పట్టించుకోలేదని రైతు వాపోయాడు.

విద్యార్థులకు చీనీకాయల పంపిణీ

గార్లదిన్నె, మార్చి 18: మండలంలోని పాతకల్లూరు ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు నరసింహులు చీనీకాయలు పంపిణీ చేశారు. ప్రస్తుతం ఎండలు మండుతున్నాయనీ, విద్యార్థులకు ఎండబెట్ట కొట్టకుండా ఉండేందుకు తమవంతు సాయంగా ఏటా పిల్లలకు ఇలా చీనీకాయలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాలలో 62 మంది విద్యార్థులకు వారానికి రెండు, మూడు ఇలా పంపిణీ చేస్తానన్నారు.

మోదీ పర్యటనతో ఒరిగింది శూన్యం: కాంగ్రెస్

అనంతపురం న్యూటౌన్, మార్చి 18: రాష్ట్రంలో ప్రధాని మోదీ పర్యటనతో ఒరిగింది శూన్యమని పీసీసీ మాజీ అధ్యక్షులు సాకే శైలజానాథ్ ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నరేంద్ర మోదీ 10 సంవత్సరాలు ఎన్‌డీఏ నాయకత్వంలో ఏపీ అభివృద్ధికి చేసిన కృషి ఏమీ లేదన్నారు. ఇప్పటికైనా టీడీపీ, జనసేన నాయకులు ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ప్రత్యేక హామీ ఇచ్చేలా ఒత్తిడి తేవాలని కోరారు. సమావేశంలో నాయకులు రవికృప రామానాయుడు, వాసు, గోవిందు పాల్గొన్నారు.

కింద పడి వ్యక్తి మృతి

ముదిగుబ్బ, మార్చి 18: ముదిగుబ్బ మండలంలోని రాళ్ళ అనంతపురం క్రాస్ సమీపంలో ప్రమాదవశాత్తు కిందపడి అనంతపురంలోని రాణినగర్‌కు చెందిన జిలాన్ (50) మరణించాడు. అతను ఆదివారం రాళ్ళఅనంతపురం క్రాస్ దగ్గర గోడౌన్‌కు వెల్డింగ్ పని చేస్తూ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. స్థానికులు అతడిని వెంటనే అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. జిలాన్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వంశీ ఆస్పత్రికి షోకాజ్ నోటీసులు: డీఎంహెచ్‌ఓ

అనంతపురం టౌన్, మార్చి 18: నల్లచెరువు మండలం అల్లుగుండు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చలిజ్వరంతో చికిత్స కోసం అనంతపురం సాయి నగర్‌లోని వంశీ ఆస్పత్రిలో శనివారం చేరాడు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. అతడి మృతికి డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని మృతుడి బంధువులు డీఎంహెచ్‌ఓ ఈబీ దేవికి ఫిర్యాదు చేశారు. దీంతో వంశీ ఆస్పత్రికి నోటీసులు జారీచేశామని, విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ ఓ ప్రకటనలో తెలిపారు.

సజావుగా టెన్త్ పరీక్షలు

చెన్నేకొత్తపల్లి, మార్చి 18: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మొదటి రోజైన సోమవారం సజావుగా సాగాయి. మోడల్ స్కూల్‌లో 137 మంది విద్యార్థులకు గాను ఒకరు, ఉన్నత పాఠశాలలో 169 మందికి గాను ముగ్గురు గైర్హాజర్ అయ్యారు.
గార్లదిన్నె : మండలంలోని గార్లదిన్నె, కల్లూరు గ్రామాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. గార్లదిన్నె ఆదర్శ పాఠశాల, ఉన్నత పాఠశాల, కల్లూరు ఉన్నత పాఠశాల మూడు సెంటర్లలో ఈ పరీక్షలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా 883 మంది విద్యార్థులకు గాను 41 మంది విద్యార్థులు గైరహజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి తారాచంద్రానాయక్ తెలిపారు.
ఆత్మకూరు : స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్, కేజీబీవీ, హోలిస్పిరిట్ పాఠశాలలో టెన్త్ పరీక్షలు నిర్వహించారు. మండలంలో మొత్తం 643 మంది విద్యార్థులకు గాను 46 మంది గైర్హాజర్ అయినట్లు మండల విద్యాశాఖ అధికారులు నరసింహారెడ్డి, రామాంజనేయులు తెలిపారు.

నేడు చంద్రమౌళీశ్వరస్వామి రథోత్సవం

ఉరవకొండ, మార్చి 18: పట్టణంలోని గవిమఠం స్థిత చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం మహారథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో గవిమఠం అధికారులు నిమగ్నమయ్యారు. సోమవారం కలశాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి రథంపై ప్రతిష్ఠించారు. మంగళవారం సా యంత్రం ఆధ్యాత్మిక ప్రబోధనా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లా నలుమూలల నుంచే కాకుం డా కర్ణాటక రాష్ట్ర భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. దీంతో భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.


రథాన్ని సిద్ధం చేసిన దృశ్యం

వలంటీర్లకు వార్నింగ్

రాయదుర్గం, మార్చి 18: వివిధ రాజకీయ పార్టీల ప్రచారాల్లో వలంటీర్లు పాల్గొంటే వారిని విధుల నుంచి తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ కిశోర్‌బాబు హెచ్చరించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వలంటీర్లకు కేటాయించిన పని మాత్రమే చేయాలన్నారు. తహసీల్దార్ చిట్టిబాబు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధం

శింగనమల నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ


జంతులూరులో ప్రచారం చేస్తున్న శ్రావణిశ్రీ, ఆలం, ముంటిమడుగు

బుక్కరాయసముద్రం, మార్చి 18: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని శింగనమల నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ అన్నారు. సోమవారం మండలంలోని జంతులూరు, కొత్తచెదళ్ల, పాత చెదళ్ల గ్రామాల్లో ఆమె ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పసుపుల హనుమంతురెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబుతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత ఐదు సంవత్సరాల్లో శింగనమల నియోజకవర్గంలో అభివృద్ధి కంటే... అవినీతే భారీగా జరిగిందన్నారు. టీడీపీ గెలుపుతో... శింగనమల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపుతామన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా... తమకు అపూర్వ స్వాగతాలు పలుకుతున్నారన్నారు. వైసీపీ నేతలు ఇప్పటికి నియోజకవర్గంలో కొన్ని గ్రామాల్లోకి వెళ్లలేక పోతున్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీను చిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ ప్రచారంలో కన్వీనర్ అశోక్, కేశన్న, ఎస్‌నారాయణస్వామి, లక్ష్మినారాయణ, రామానాయుడు, గోపాల్, ఆర్ నారాయణస్వామి, గుర్రప్ప, ఓబులపతి, నరేంద్రయాదవ్, చితంబరి , రమేష్ సురేష్ చౌదరి పాల్గొన్నారు.

బండారు శ్రావణికి దండు శుభాకాంక్షలు

శింగనమల: శింగనమల నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీని సోమవారం అనంతపురంలోని ఆమె స్వగృహంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు కలిసి.. శుభాకాంక్షలు తెలిపారు. బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ... టీడీపీ కుటుంబంలో చిన్న చిన్న సమస్యలు వచ్చినా.. కుటుంబలాగా సర్దుకొని ప్రతి ఒక్కరూ కష్టపడి నియోజకవర్గంలో పార్టీని గెలిపించి.. చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడమే అందరి లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, దాసరి గంగాధర్, మాజీ ఎంపీటీసీ కుళ్లాయప్ప, రాష్ట్ర బీసీసెల్ కార్యదర్శి ఎం.ఆదినారాయణ, జిల్లా బీసీసెల్ బండి పరుసురాం, అనంతచౌదరి, నారాయణస్వామి,పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


బండారు శ్రావణిశ్రీకి శుభాకాంక్షలు తెలుపుతున్న దండు శ్రీనివాసులు

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: రాప్తాడు మండలం వరిమడుగులో మాజీ మంత్రి పరిటాల సునీత సోదరుడు ధర్మవరపు మురళి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మర్తాడులో టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల క్రిష్ణయ్య, బీసీసెల్ అధికార ప్రతినిధి గోసుల సుబ్బయ్య ఆధ్వర్యంలో, చెన్నేకొత్తపల్లి మండలం హరియన్ చెరువులో కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబిలేసు ఆధ్వర్యంలో, అనంతపురంరూరల్ మండలంలోని చియ్యేడులో నాయకులు చియ్యేడు లక్ష్మినారాయణ, సాయినాథరెడ్డి ఆధ్వర్యంలో, కనగానపల్లి మండలంలోని వేపకుంట గ్రామంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, మండల కన్వీనర్ యాతం పోతలయ్య ఆధ్వర్యంలో, ఆత్మకూరు మండలంలో బి యాలేరు గ్రామంలో మండల టీడీపీ ఇన్‌చార్జి బాలాజి, సీనియర్ నాయకుడు మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.


వరిమడుగులో...


మర్తాడులో...


హరియాన్‌చెరువులో...


చియ్యేడులో...


వేపకుంటలో...


బి యాలేరులో...

ఆలయ వ్యవస్థను రక్షించుకుందాం

దత్త విజయానందతీర్థ స్వామి ఉద్బోధ

అనంతపురం కల్చరల్, మార్చి 18: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా దేవాలయ వ్యవస్థను రక్షించుకునేందుకు ప్రతిఒక్కరూ పాటుపడాలని గణపతి సచ్చిదానందస్వామి ప్రధాన శిష్యుడు దత్త విజయానందతీర్థ స్వామి పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి రోడ్డులోని జ్ఞానసాగర దత్తాత్రేయస్వామి ఆలయ 36వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా రెండో రోజైన సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ ఆవరణంలోని వేదికపై ఆయన భక్తులనుద్దేశించి అనుగ్రభాషణం చేశారు. ప్రపంచ దేశాల్లో భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు చాలా గొప్పవి.. వెలకట్టలేనివని అని అన్నారు. కంటికి కనిపించలేదని.. దైవత్వాన్ని నమ్మనివారు మూర్ఖులని పేర్కొన్నారు. మనలోని శ్రద్ధ, భక్తిప్రపత్తులకు మూల కేంద్రాలు ఆలయాలు అని, మనతోపాటు మన తోటివారందరినీ కలుపుకుని దేవాలయ వ్యవస్థను రక్షించుకునేందుకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో గణపతి సచ్చిదానంద స్వామి జ్ఞానబోధ సభ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ శర్మ గోసాల, భక్తులు పాల్గొన్నారు.



అనుగ్రహభాషణం చేస్తున్న దత్త విజయానందతీర్థ స్వామి, పాల్గొన్న భక్తులు

వైభవంగా ఎర్రితాతస్వామి పరుష

రాప్తాడు, మార్చి 18: మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో సోమవారం వైభవంగా ఎర్రితాతస్వామి పరుష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రితాత స్వామిని వైభవంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన అనేక మంది భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. జిల్లా స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించారు. ఆత్మకూరు మండలం కుర్లపల్లికి చెందిన తలారి యంకమ్మ వృషబాలు 3045 అడుగులు లాగి రెండో బహుమతి రూ. 20 వేలు గెలుపొందాయి.

ఉట్ల పరుష : ఎర్రితాత స్వామి ఆలయం వద్ద సోమవారం సాయంత్రం వైభవంగా ఉట్ల పరుష నిర్వహించారు. గ్రామంలోని యువకులు బురద పట్టించిన ఉట్ల మాను ఎక్కేందుకు పోటీపడ్డారు.


అలంకరణలో ఎర్రితాతస్వామి

విధుల్లో చేరిన జడ్పీ డిప్యూటీ సీఈఓ

అనంతపురం విద్య, మార్చి 18: జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి విధుల్లో చేశారు. ఇక్కడ పనిచేస్తున్న లలితాభాయాని గుంతకల్లు డీఎల్‌డీఓగా, డ్వామాలో విజిలెన్స్ ఆఫీసర్‌గా పని చేస్తున్న రమణారెడ్డిని డిప్యూటీ సీఈఓగా ఇటీవల కలెక్టర్ నియమించిన విషయం విధితమే. దీంతో ఆయన సోమవారం డిప్యూటీ సీఈఓ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. జడ్పీలోని పలువురు అధికారులు, ఉద్యోగులు ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను, సీఈఓ నిదియాదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు.



జాబ్ కన్సల్టెన్సీ నిర్వాహకుల ఆగడాలను అరికట్టాలి

అనంతపురం కల్చరల్, మార్చి 18: గుత్తిలోని ఎంఎస్ సొల్యూషన్స్ జాబ్ కన్సల్టెన్సీ నిర్వాహకుల ఆగడాలను అరికట్టి, వారి వెనుకనున్న బడాబాబులను శిక్షించి బాధితులకు న్యాయం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులే లక్ష్యంగా ఇప్పటివరకూ నగరాలు, పట్టణాలకు మాత్రమే పరిమితమైన జాబ్‌కన్సల్టెన్సీ నిర్వాహకుల మోసాలు.. ఇప్పుడు మండల కేంద్రాల్లోనూ పుట్టగొడుగుల్లా విస్తరిస్తున్నాయన్నారు. వాటివల్ల నిరుద్యోగ యువతీయువకులు మోసపోతున్నారన్నారు. గుత్తిలో ఇద్దరు దంపతులు నిర్వహిస్తున్న జాబ్ కన్సల్టెన్సీ బాగోతం ఆదివారం బయటపడిందన్నారు. నిరుద్యోగ యువతను మోసం చేసిందే కాక .. వారిని పెద్దల అండతో బెదిరిస్తున్నారన్నారు. ఆ దంపతుల వెనుక ఉన్న బడాబాబులను వెంటనే అరెస్టు చేసి, బాధితులకు తిరిగి డబ్బు ఇప్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గతంలోనూ కర్నూలు తదితర నగరాల్లో ఇలాంటి మోసాలు వెలుగులోకి వచ్చాయన్నారు. ఇప్పుడు అనంతపురం జిల్లాలోనూ ఇలాంటివి నడుపుతున్నారని, వాటికి అడ్డుకట్ట వేయాల్సిన సంబంధితశాఖ అధికారులు స్పందించకపోవడం చూస్తుంటే ఇందులో వారి ప్రమేయమూ ఉన్నట్లు అనుమానాలు వస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ఎంఎస్ సొల్యూషన్స్ జాబ్ కన్సల్టెన్సీ నిర్వాహకులు, వారి వెనుక ఉన్న వారిని చట్టపరంగా శిక్షించాలని కోరారు.

ఘనంగా పౌష్టికాహార పక్షోత్సవాలు

నార్పల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం పౌష్టికాహారం పక్షోత్సవాలను నిర్వహించారు. ఇందులో తహసీల్దారు లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ రాముడు, సీడీపీఓ భారతి, సూపర్‌వైజర్లు సునాలిని, మధుమాలిని, అంగన్వాడీ కార్యకర్తలు సుధమ్మ, శ్రీదేవి, రామాంజినమ్మ, రేణుక, కళావతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రేపు పాండురంగస్వామి నిజపాద స్పర్శ దర్శనం

అనంతపురం కల్చరల్, మార్చి 18: ఫాల్గుణ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం రామ్‌నగర్‌లోని రుక్మిణి పాండురంగస్వామి దేవాలయంలో నిజపాద స్పర్శ దర్శనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు భవసార్ క్షత్రియ సమాజ్ అధ్యక్ష కార్యదర్శులు తిరుపతిరావు, ఆనంద్ సోమవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఏకాదశి సందర్భంగా భక్తులతో పాదస్పర్శ చేయిస్తామన్నారు. భక్తులు సదావకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి: ఎస్ఎఫ్ఐ

అనంతపురం కల్చరల్, మార్చి 18: కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీకి వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ... విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు దోపిడీని ప్రారంభించాయన్నారు. ఇప్పటికే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్లు చేసుకుంటున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోక పోవడం తగదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేయడంతోపాటు మార్కులు, ర్యాంకుల కోసం విద్యార్థులను మానసికంగా, నైతికంగా వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. ఆ వేధింపులు తాళలేక చాలామంది విద్యార్థులు ఆత్మహ త్యలకు పాల్పడుతున్నారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి, ముందస్తు అడ్మిషన్లు చేసుకుంటున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఇందులో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా గర్ల్స్ కన్వీనర్ రజిత, జిల్లా అధ్యక్షుడు శివ, ఉపాధ్యక్షుడు వైటిసి రమేష్, సిద్దు, వంశి, సహాయ కార్యదర్శులు గిరి, వెంకి, చందు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజల గొంతెండుతున్నా పట్టించుకోరా..!

45 రోజులుగా నీటి కోసం అవస్థలు: టీడీపీ నాయకులు

అనంతపురంరూరల్, మార్చి 18: గ్రామాల్లో తాగునీటి ఎద్దడితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. వైసీపీ నేతలు పట్టించుకోవడం లేదని మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్ మండిపడ్డారు. సోమవారం పాపంపేటలో మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, వైస్ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ చల్లా జయకృష్ణ, తదితరులతో కలసి ఆయన మాట్లాడారు. పాపంపేట పంచాయతీ ప్రజలు నెలన్నర రోజులుగా నీటి కష్టాలు పడుతున్నారన్నారు. ఇంత అధ్వాన పరిస్థితి ఎన్నడూ చూడలేదన్నారు. టీడీపీ హయంలో మాజీ మంత్రి పరిటాల సునీత నేతృత్వంలో తామంతా సత్యసాయి నీటి ప్రజలకు అందించేందుకు చొరవ తీసుకున్నామన్నారు. ప్రస్తుతం స్థానిక నాయకులు ఆ మాత్రం చొరవ చూపడంలేదన్నారు. నాలుగున్నర ఏళ్లుగా నెలలో పదిరోజుల కొక్కసారి తాగునీరు వచ్చేదే గగనంగా మారిందన్నారు. నీటి సరఫరాపై సత్యసాయి కార్మికులను అడిగితే.. మోటర్లు చెడిపోయాయని, తమకు వేతనాలు కూడా సరిగా ఇవ్వడం లేదని చెబుతున్నారన్నారు. వైసీపీలో పాలనలో సత్యసాయి నీటి పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ప్రస్తుతం ఎన్నికలు వస్తుండటంతో.. ఉప్పునీటి బోర్లు వేసి నీటిని సరఫరా చేసేందుకు నాయకులు ముందుకు వస్తున్నారన్నారు. అధికారులు ఇప్పటికైనా మేలుకుని నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లింగమయ్య, రామాంజినేయులు, గోవిందు, రత్నమోహన్, లక్ష్మిదేవి, స్వప్న, వెంకటరాముడు, దస్తగిరి, సాంబశివ, పతకమూరి శ్రీనివాసులు, బోయ భాస్కర్, భరత్, హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

టెన్త్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు

అనంతపురం క్రైం, మార్చి 18: జిల్లాలోని పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు పోలీసులు సోమవారం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షాకేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పరీక్ష ముగిసే వరకు సమీప ప్రాంతాల్లోని జిరాక్స్, ప్రింటింగ్ సెంటర్లు మూసేయించారు. ఈనెల 30వ తేదీ వరకు నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 142 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.



అనంతలక్ష్మి కళాశాల వద్ద హోర్డింగ్‌లో తొలగించని సీఎం జగన్ చిత్రం

అధికారులూ.. కనిపించడం లేదా..?

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే.. టీడీపీ, జనసేన.. తదితర విపక్ష పార్టీల పోస్టర్లను, ఫ్లెక్సీలను గంటల వ్యవధిలోనే అధికారులు తొలగించారు. ఇటుకలపల్లి సమీపంలోని అనంతలక్ష్మి కళాశాల వద్ద.. రుద్రంపేట సర్కిల్ సమీపంలో ఉన్న ఈ భారీ ఫ్లెక్సీలు మాత్రం తొలగించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

\- అనంతపురంరూరల్



రుద్రంపేట సర్కిల్ సమీపాన సిద్ధం పోస్టర్

చీనీకాయలు టన్ను రూ.24 వేలు

అనంతపురంరూరల్, మార్చి 18: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.24 వేలు, కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.16వేలతో అమ్ముడు పోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 802 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ప్రజాబలంతో టీడీపీ జెండా ఎగురవేద్దాం



సూపర్‌సిక్స్ పథకాల గురించి మహిళకు వివరిస్తున్న అమిలినేని రమాదేవి

కళ్యాణదుర్గం, మార్చి 18: ప్రజాబలంతో కళ్యాణదుర్గంలో టీడీపీ జెండా ఎగురవేద్దామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు భార్య అమిలినేని రమాదేవి, కోడలు ఇషిత అన్నారు. సోమవారం కళ్యాణదుర్గం మున్సిపల్ పరిధిలోని 23వ వార్డు, ఎస్సీ కాలనీతో పాటు పలు కాలనీల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను అందజేశారు. కళ్యాణదుర్గంలో టీడీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ఆ ప్రజాబలంతోనే ఈ సారి టీడీపీ విజయం సాధించడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూడికతీతతో పెరిగిన చెరువుల సామర్థ్యం



సెల్ఫీ తీసుకుంటున్న మాజీ మంత్రి కాలవ

రాయదుర్గం, మార్చి 18: శతాబ్దాల చరిత్ర కలిగిన కణేకల్లు చిక్కణ్ణేశ్వర చెరువులో పూడికతీత పనులను తన హయాంలో చేపట్టామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు అన్నారు. తన 50 వారాల సెల్ఫీ చాలెంజీలో భాగంగా కణేకల్లు చెరువుపై సోమవారం ఆయన 49వ సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. వందల ఏళ్ల కిందట నిర్మించిన చెరువులో పూడిక పేరుకుపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందన్నారు. తద్వారా ఆ చెరువు ఆయకట్టు అవసరాలు తీరక రైతులు ఇబ్బందులకు గురయ్యేవారన్నారు. టీడీపీ హయాంలో చెరువులో పూడికతీత పనుల కోసం రూ.2 కోట్లు మంజూరు చేశామన్నారు. చాలా వరకు పనులను చేశామన్నారు. కణేకల్లు ప్రాంత రైతుల విజ్ఞప్తి మేరకు రెండో పంటకు సాగునీరు అందించడం కోసమే పూడికతీతపై ప్రత్యేక చొరవ తీసుకున్నామన్నారు. రైతుల కోసం వేదవతి నది గర్భంలో సబ్‌సర్ఫేస్ డ్యాములను కూడా నిర్మించామన్నారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం రైతు బాగు కోసం ఒక్కటైనా మంచి చేసిందా అని ప్రశ్నించారు. రైతుల సంక్షేమ పథకాలన్నీ రద్దు చేసిన జగన్‌మోహన్‌రెడ్డి రైతు ద్రోహిగా చరిత్రలో శాశ్వతస్థానాన్ని దక్కించుకున్నాడని దుయ్యబట్టారు. రెండునెలల్లో జరిగే సాధారణ ఎన్నికల్లో వైసీపీని గద్దె దించే అవకాశం ప్రజలకు వచ్చిందన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక



టీడీపీలోకి చేరిన వారితో గుమ్మనూరు సోదరులు

గుత్తిరూరల్, మార్చి18: మండలంలోని కె.ఊబిచెర్ల గ్రామంలో సోమవారం వైసీపీ నుంచి టీడీపీ పార్టీలోకి గుమ్మనూరు సోదరుల ఆధ్వర్యంలో చేరారు. మాజీ మంత్రి సోదరులు నారాయణ స్వామి, శ్రీనివాసులు, నారాయణ, కుమారుడు ఈశ్వర్ గ్రామానికి చెందిన కంబగిరి, పెద్ద వెంకటేష్, రంగస్వామి, మల్లి, జయరాముడు, మద్దిలేటితో సహ మరో 15 కుటుంబల వారికి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు ప్రభాకర్ నాయుడు, రవి తేజ, నారాయణస్వామి, ప్రతాప్, గోవిందు, రామాంజునేయులు పాల్గొన్నారు.

కూడేరు: మండలంలోని కరుట్లపల్లి, శివరాంపేట గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కరుట్లపల్లి గ్రామానికి చెందిన బండి తిమ్మరాజు, ప్రసాద్, శ్రీరాములు, ఉజ్జినయ్య, ఓబులేసు, ఆంజినేయులు, నాగన్న, పూజారి నాగరాజు, మల్లికార్జున, రేవన్న, విశ్వనాథ్, శివరాంపేటకు చెందిన రాజశేఖర్, ఎర్రిస్వామి, ధనుంజయ్య, గోపాల్, లక్ష్మీనారాయణ పార్టీలోకి చేరడంతో వారికి పయ్యావుల శ్రీనివాసులు కండువాలు కప్పి ఆహ్వానించారు.

తహసీల్దారు అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

బెళుగుప్ప, మార్చి 18: తహసీల్దార్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలంటూ సోమవారం టీడీపీ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ హస్సేన్‌పీరాకు ఫిర్యాదు చేశారు. నాయకులు పెద్దతిప్పయ్య, తగ్గుపర్తి రాధాకృష్ణ, మల్లికార్జున, దుద్దేకుంట తిమ్మప్ప, సర్పంచ్ రాము, రామసాగరం రామ్‌మోహన్ రెడ్డి, విజయ, వయ్యాలప్ప మాట్లాడుతూ గత ఏడాది జూన్ నుంచి ఫిబ్రవరి వరకు తహసీల్దారుగా విధులు నిర్వహించిన ఓబులేసు లక్షలాది రూపాయలు దండుకున్నాడని ఆరోపించారు. పట్టాదారు పాసుపుస్తకాలు, ఇళ్ల పట్టాలు డబ్బులిచ్చిన వారికి మంజూరు చేశారన్నారు. అధికార పార్టీకి చెందిన ఎంపీపీ, తహసీల్దారు అవకతవకలకు పాల్పడ్డారని ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు.

ప్రచారంలో పాల్గొన్న వారిపై...

రాయదుర్గంరూరల్, మార్చి 18: పట్టణంలో ఆదివారం వైసీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న డీలర్లు, వలంటీర్లపై చర్యలు తీసుకోవాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి రాజు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో చిట్టిబాబుకు, పురపాలక సంఘం కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. పట్టణానికి చెందిన స్టోర్ డీలర్లు, వలంటీర్లు రఫి, వంశీ, మేకల శ్రీనివాసులు, కృష్ణమూర్తిలపై చర్యలు తీసుకొని విధుల నుంచి తొలగించాలని ఆయన అధికారులను కోరారు. టీడీపీ నాయకులు రామాంజి, సిద్ధప్ప, తిప్పేస్వామి పాల్గొన్నారు.

జీన్స్ పరిశ్రమను కణేకల్లుకు విస్తరిస్తాం: కాలవ



సంజయనగర్‌లో ప్రచారం చేస్తున్న కాలవ శ్రీనివాసులు

కణేకల్లు, మార్చి 18: రాయదుర్గంలో అభివృద్ధి చెందిన జీన్స్ పరిశ్రమను కణేకల్లుకు విస్తరిస్తామని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. సోమవారం ఆయన కణేకల్లులోని సంజయ్‌నగర్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి ఇంటింటికి వెళ్లి తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యధికంగా ముస్లిం మైనార్టీలున్న కణేకల్లులో గతంలో షాదీఖానా మంజూరు చేయించడమే కాకుండా రోడ్డు వెడల్పు కూడా చేయించామన్నారు. తుంగభద్ర ఎగువ కాలువ నీటి సమస్యను ఏ రైతు ఎదుర్కోకుండా తన హయాంలో చేశానన్నారు. అందరికీ అండగా ఉండి సక్రమంగా నీరు అందించేందుకు ఏర్పాట్లు చేశానన్నారు. భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు మెరుగు పరచడానికి కృషి చేస్తానన్నారు. ఉచితంగా కుట్టుమిషన్లు అందించడమే కాకుండా స్కిల్ డెవలప్ మెంట్ ద్వారా నైపుణ్యాన్ని పెంచి జీవనోపాధిని మెరుగు పరుస్తానన్నారు. కణేకల్లు పంచాయతీలో రెండు వేలకుపైగా మెజార్టీ సాధిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, వేలూరు మరియప్ప, కోళకుర్తి సుదర్శన్, బీటీ రమేష్, ఎస్‌కే మల్లికార్జున, షేక్‌ముజ్జు, బాయినేని నవీన్, మాబుసాబ్, చాంద్‌బాషా, కురుబ నాగరాజు, చంద్రశేఖర్‌గుప్తా, అనిల్, వెంకటేశులు, శ్రీకాంత్, కిషోర్, జలంధర్‌రెడ్డి, జయశీలారెడ్డి, మారుతి, సక్లైన్, నరేష్, కృష్ణారెడ్డి, సూరి, అంజిబాబు, ఎల్లప్ప, ఆంజినేయులు, ప్రకాష్, వరుణ్, జనసేన నాయకులు రవి, రామ్ పాల్గొన్నారు.

నాకు న్యాయం చేయండి

- పోలీసులకు కౌన్సిలర్ తల్లి సావిత్రి ఫిర్యాదు
- జేసీపీఆర్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం



పోలీస్ స్టేషన్ వద్దకు ర్యాలీగా వస్తున్న జేసీపీఆర్, టీడీపీ శ్రేణులు



మాట్లాడుతున్న మల్లికార్జున తల్లి సావిత్రి

తాడిపత్రిటౌన్, మార్చి 18: కౌన్సిలర్ అరెస్టు విషయంలో పోలీసు అధికారులు మాకు న్యాయం చేయాలని 30వవార్డు టీడీపీ కౌన్సిలర్ కొత్తపల్లి మల్లికార్జున తల్లి సావిత్రి సోమవారం సీఐ మురళీకృష్ణకు ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ తన కుమారుడు మల్లికార్జున గత మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ కౌన్సిలర్‌గా గెలుపొందాడన్నారు. ఈ వార్డు ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటికి సమీపంలోనే ఉండ డం, కుమారుడు మెజార్టీతో గెలుపొందడంతో ఎమ్మెల్యే జీర్ణించుకోలేకపోయాడని తెలిపింది. వార్డులో నెలకొన్న సమస్యలను సోషల్‌మీడియా ద్వారా ఎండగట్టడం వైసీపీ నాయకులకు నచ్చలేదన్నారు. దీంతో తన కుమారుడిపై కక్షకట్టి వారం రోజులక్రితం వైసీపీ ప్రోద్బలంతో పట్టణంలోని సీపీఐ కాలనీకి చెందిన అనూష తనను ప్రేమించానని పెళ్లిచేసుకుంటానని చెప్పి మోసం చేశాడని ఫిర్యాదు ఇప్పించారన్నారు. ఈ ఫిర్యాదులో తన కుమారుని కారణంగా రెండుసార్లు అబార్షన్ అయినట్లు పేర్కొన్నారన్నారు. దీనిపై ఏ డాక్టర్ అబార్షన్ చేశారు, ఏ ఆసుపత్రిలో జరిగింది, అబార్షన్ చేసే సమయంలో గర్భంలో ఉన్న శిశువు ఏ స్థాయిలో ఉందనేది విచారించకుండానే తన కుమారున్ని అరెస్టచేసి రిమాండ్‌కు పంపడం ఏంటని ఆమె ప్రశ్నించారు. తమపై కులంపేరుతో అనూష దూషించిందని న్యాయం చేయాలని డిమాండ్‌చేసింది. పోలీసు అధికారులు పూర్తిస్థాయిలో విచారించి అనూషపై కేసు నమోదు చేయాలని ఆమె కోరారు.

మున్సిపల్ చైర్మన్ జేసీపీఆర్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

కౌన్సిలర్ మల్లికార్జున కుటుంబానికి న్యాయం జరగాలని సోమవారం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి నివాసం నుంచి టీడీపీ శ్రేణులు ప్లకార్డులు చేతపట్టుకొని భారీగా పోలీస్‌స్టేషన్‌కు ర్యాలీగా తరలివచ్చాయి. జేసీపీఆర్ పోలీస్‌స్టేషన్ ముందు నిరసన వ్యక్తంచేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి సీఐ మురళీకృష్ణను కలిసి పూర్తిస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. విషయం ముందే పసిగట్టిన పోలీసు అధికారులు భారీబందోబస్తును ఏర్పాటుచేశారు. జేసీ ప్రభాకర్ రెడ్డి సీఐతో మాట్లాడి వెనుదిరగడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.

చంద్రబాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ: అశ్మిత్ రెడ్డి



యర్రగుంట్లలో జేసీ అశ్మిత్‌రెడ్డి ప్రచారం



బెళుగుప్పలో పయ్యావుల విజయసింహ...



బొమ్మనహాల్‌లో...

తాడిపత్రిటౌన్, మార్చి 18: చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ అని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని యర్రగుంటపల్లి గ్రామంలో సోమవారం ఆయన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదిరి శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచు యుగంధర్, మండల కన్వీనర్ నరేంద్రనాయుడు, నాయకులు భాస్కర్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, జయరామిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెళుగుప్ప: భవిష్యత్ గ్యారెంటీతో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతాయని, సైకిల్ గుర్తుకు ఓటేసి నాన్నను గెలిపించాలని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ తనయుడు విజయసింహ కోరారు. మండలంలోని ఎర్రగుడిలో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీపై ఆయన విస్తృత ప్రచారం చేశారు. ఆయనకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. లక్ష్మీనారాయణ, ఓబయ్య, బాలాజీ మనోహర, ఆర్మీ మెంబరు స్రవంతి, దబ్బర సుశీలమ్మ, గోవర్ధన్, అశోక, భరణి, చిరంజీవి, హనుమంతరాయుడు, ప్రభాకర్, యర్రిస్వామి, దబ్బర వెంకటేశులు, దేవేంద్ర, రాజన్న, సుంకన్న పాల్గొన్నారు.

కూడేరు: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే తనయుడు విక్రమ సింహ అన్నారు. సోమవారం ముద్దలాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పార్టీ ప్రవేశపెడుతున్న పథకాల గురించి వివరించారు.

బొమ్మనహాళ్: చంద్రబాబు అధికారంలోకి వస్తేనే పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని టీడీపీ నాయకులు అన్నారు. సోమవారం మండలంలోని నేమకల్లు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ బెళ్లి హనుమంతరెడ్డి, టీడీపీ నాయకులు రమేష్, గాదిలింగ పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మండలంలోని వరదాయపల్లి గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. తెలుగుయువత ఉపాధ్యక్షుడు తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికి తిరిగి టీడీపీ మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. బీసీ రామకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ గుర్తి రఘునాయుడు, అదెన్న, శ్రీరాములు, నారాయణస్వామి, చిన్న అమర్‌సింహ పాల్గొన్నారు.

కాలవ భరత్ విస్తృత ప్రచారం



కరపత్రాలను అందజేస్తున్న కాలవ భరత్

రాయదుర్గంరూరల్, మార్చి 18: తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ మండలంలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. సోమవారం మండలంలోని చదం గ్రామంలో కన్వీనర్ హనుమంతు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముందుకు సాగారు. గ్రామంలో టీడీపీ నాయకులు, అభిమానులు కాలవ భరత్‌ను శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా ఆహ్వానించారు. ఇంటింటికి తిరుగుతూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి రాష్ట్రంలో చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. రాయదుర్గం అభివృద్ధి చెందాలంటే కాలవ శ్రీనివాసులు ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సర్పంచులు వన్నూరుస్వామి, మల్లేశప్ప, జుంజురంపల్లి సర్పంచ్ ఆవులదట్ల రామస్వామి, హనుమంతు, సోమశేఖర్, ఆనంద్‌రెడ్డి, ఆనంద్‌శేఖర్, కొల్లారప్ప, రామయ్య పాల్గొన్నారు.

జేసీపీఆర్‌ను కలిసిన వైసీపీ నాయకులు

తాడిపత్రిటౌన్, మార్చి 18: స్థానిక నివాసంలో సోమవారం మధ్యాహ్నం టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిని పలువురు వైసీపీ నాయకులు కలిశారు. వారిని జేసీపీఆర్ ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. ఆయనను కలిసిన వారిలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఎంఏ రంగారెడ్డి, షబ్బీర్‌బాషా, వాసుదేవరెడ్డి ఉన్నారు. వీరు జేసీపీఆర్‌ను కలవడంతో టీడీపీలోకి చేరతారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

ఆలయ అభివృద్ధికి విరాళం

కుందుర్పి, మార్చి 18: మండల వడ్డిపాళ్యం గ్రామంలో వెలసిన గుడిబండ వీరాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు కుమారుడు అమిలినేని యశ్వంత్ రూ.1.30 లక్షల విరాళం అందించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

ఎన్నికల కోడ్ అమలుకు చర్యలు

బెళుగుప్ప, మార్చి 18: మండల కేంద్రంలో ఎన్నికలకోడ్ అమలుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. సోమవారం కోడ్ కూసినా మేల్కోరా... అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో ఉదయమే అధికారులు సచివాలయం ఆర్బీకేకు పరుగులు తీశారు. జగన్ బొమ్మకు పేపర్స్ అతికించారు.

జనసేనలోకి చేరిక

ఉరవకొండ, మార్చి 18: మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన పలువురు జనసేన పార్టీలోకి చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గౌతమ్ ఆధ్వర్యంలో పలువురు జనసేన తీర్థం పుచ్చుకున్నారు.

ఆర్థిక సహాయం అందజేత: విడపనకల్లు మండలం గాజులమాళాపురం గ్రామంలో లింగప్ప అనే వ్యక్తికి చెందిన గుడిసె విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో దగ్ధమైన విషయం తెల్సిందే. విషయం తెలుసుకున్న పయ్యావుల శ్రీనివాసులు స్పందించి రూ.25 వేలు ఆర్థికసహాయం అందజేశారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుంతకల్లుటౌన్, మార్చి 18: గుంతకల్లు, బళ్లారి రైలు మార్గం, బంటనహాల్ రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం 40 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు. మృతుడు 5.5 అడుగుల ఎత్తు, ఆరెంజ్ కలర్ చొక్కా, బ్రౌన్ కలర్ ప్యాంట్ ధరించాడన్నారు. అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుంతకల్లు ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుత్తిలో వరుస చోరీలు

గుత్తి, మార్చి 18: పట్టణంలో వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఆదివారం రాత్రి వివిధ ప్రాంతాలలో ఉన్న మూడు దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. అలాగే మరో మూడు దుకాణాల్లో చోరీకి యత్నించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న న్యాయవాది ఇస్మాయిల్ కార్యాలయంలో షట్టర్ తాళాలను పగలగొట్టి లోపలికి చొరబడి రూ.5వేలు దోచుకెళ్లారు. తాడిపత్రి రోడ్డులోని మహబూబ్ బాషా ఫొటో స్టూడియో తాళాలు పగలగొట్టి రూ.5వేలు, జిరాక్స్ సెంటర్‌లో ల్యాప్‌ట్యాప్ ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనలపై సోమవారం బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాలను పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు చంద్రమౌళీశ్వరస్వామి రథోత్సవం



రథాన్ని సిద్ధం చేసిన దృశ్యం

ఉరవకొండ, మార్చి 18: పట్టణంలోని గవిమఠంస్థిత చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం మహారథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో గవిమఠం అధికారులు నిమగ్నమయ్యారు. సోమవారం కలశాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి రథంపై ప్రతిష్ఠించారు. మంగళవారం సాయంత్రం ఆధ్యాత్మిక ప్రబోధనా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్ర భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్నారు. దీంతో భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఇద్దరు వలంటీర్ల రాజీనామా

బొమ్మనహాళ్, మార్చి 18: మండలంలోని గోవిందవాడ, హరేసముద్రం గ్రామాల వలంటీర్లు సుధాకర్, రాముడు రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ విజయమ్మ తెలిపారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో కోడ్ కూసినా వైసీపీ సేవలో వలంటీర్లు అనే శీర్షికన ప్రచురించడంతో అధికారులు వలంటీర్లను పిలిపించి సంజాయిషీ తీసుకున్నారు. పార్టీ కార్యక్రమంలో పాల్గొన్నందుకు మేము రాజీనామా చేస్తున్నామని రాజీనామాపత్రాలను అందించినట్లు తెలిపారు. ఈ రాజీనామా పత్రాలను బొమ్మనహాళ్ తహశీల్దార్‌కు పంపించినట్లు తెలిపారు.

వలంటీర్లకు వార్నింగ్

రాయదుర్గం, మార్చి 18: వివిధ రాజకీయ పార్టీల ప్రచారాల్లో వలంటీర్లు పాల్గొంటే వారిని విధుల నుంచి తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ కిశోర్‌బాబు హెచ్చరించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వలంటీర్లకు కేటాయించిన పని మాత్రమే చేయాలన్నారు. తహసీల్దార్ చిట్టిబాబు పాల్గొన్నారు.

యువరైతును కాటేసిన కరెంటు



ఉపేంద్ర (ఫైల్)

బొమ్మనహాళ్, మార్చి 18: కొత్త బోరు వేసి పంటదిగుబడి సాధించాలన్న ఓ యువరైతు ఆశను కరెంటు కాటేసిన ఘటన మండలంలోని గోవిందవాడలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు గోవిందవాడ గ్రామానికి చెందిన ఉపేంద్ర(25) అనే యువరైతు తనకు చెందిన 1.50 ఎకరాల భూమిలో ఖరీఫ్‌లో వేరుశనగ, రబీలో మిరపను సాగు చేశాడు. ఈ ఏడాది వర్షాలు సరిగ్గా లేక హెచ్చెల్సీ నీరు అంతంత మాత్రం రావడంతో, పంటల దిగుబడిపై ప్రభావం పడింది. వ్యవసాయ బోరు ఉంటే దిగుబడి బాగా వస్తుందని ఆశించిన ఉపేంద్ర నాలుగురోజుల క్రితం అప్పు చేసి బోరు వేయించాడు. సోమవారం మోటారు దింపి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు విద్యుత్ స్తంభం ఎక్కి వైరు చుడుతున్న సమయంలో కరెంట్ సరఫరా కావడంతో కరెంటు స్తంభం నుండి కిందపడి స్పృహ కోల్పోయింది. అక్కడే ఉన్న కొందరు అతనిని బళ్లారి విమ్స్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య పవిత్ర, రెండేళ్ల కుమారుడు వల్లభ ఉన్నారని తెలిపారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఇంటి పెద్దదిక్కును కోల్పోవడంతో బాధిత కుటుంబంలో తీరని వేదనను మిగిల్చింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఉపేంద్ర మృతి చెందడంతో భార్య పవిత్ర ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు. సంఘటనపై విద్యుత్ ఏఈ లక్ష్మీరెడ్డిని వివరణ కోరగా కరెంట్ షాక్‌తో ఉపేంద్ర మృతి చెందినట్లు సమాచారం అందిందన్నారు. మృతిచెందిన రైతుకు సంబంధించిన వివరాలు అందాల్సి ఉందని, విద్యుత్ ప్రమాదమా స్టార్టర్ పెట్టె వద్ద జరిగిందా అని దానిపై విచారిస్తామన్నారు.

రెండు దుకాణాల దగ్ధం

గుంతకల్లుటౌన్, మార్చి 18: పట్టణంలోని మార్కెట్ రోడ్డులో పూలు, టెంకాయల దుకాణాలు ఆదివారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.6లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు నాగరాజు, పులికొండ తెలిపారు. అర్ధరాత్రి దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు పూలదుకాణం యజమాని నాగరాజుకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. నాగరాజు పూలదుకాణంలో రూ.3లక్షల విలువ చేసే శాలువలు, పూలు పూర్తిగా దగ్ధమయ్యాయి. పులికొండ టెంకాయల దుకాణంలో రూ.3లక్షల విలువ చేసే టెంకాయలు దగ్ధమయ్యాయని బాధితుడు వాపోయాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బొమ్మనహాళ్, మార్చి 18: మండల కేంద్రంలోని బళ్లారి రహదారిపై ఆదివారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడి ఇద్దరు వ్యక్తులకు గాయాలైన సంఘటన తెలిసిందే. ఇందులో వ్యక్తి బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. కణేకల్లు మండలం అంబాపురం గ్రామానికి చెందిన గురుమూర్తి అనే వ్యక్తి తన ద్విచక్రవాహనంలో బళ్లారి వైపు నుంచి స్వగ్రామానికి వస్తుండగా బీహార్‌కు చెందిన ఉదయ్(46) అనే వ్యక్తి మార్గ మధ్యంలో ఎక్కించుకుని వస్తూ బొమ్మనహాళ్ సమీపంలో వాహనం అదుపుతప్పి కింద పడ్డారు. తీవ్రంగా గాయపడిన ఉదయ్ బళ్లారి విమ్స్‌లో ఆదివారం రాత్రే మృతి చెందాడన్నారు. ఉదయ్ జిందాల్ కర్మాగారంలో పనిచేస్తున్నాడని ఇతనికి భార్య పునీతదేవి, ఇద్దరు పిల్లలున్నారన్నారు. మృతుడి బావమరిది రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ

రాయదుర్గంరూరల్, మార్చి 18: మండలంలోని టీ వీరాపురం ప్రభుత్వ పాఠశాలను ఆర్జేడీ రాఘవరెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పాఠశాలలోని రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ఇస్తున్న హోం వర్క్ పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు.

పది పరీక్షలు ప్రారంభం

పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గుంతకల్లు పట్టణంలో నిర్వహించిన తెలుగు పరీక్షకు 2295 మంది విద్యార్థులకు 2187 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓలు మస్తారావు, సుబ్బరాయుడు తెలిపారు. 108 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఉరవకొండలో ఐదు పరీక్ష కేంద్రాల్లో 1351 మంది విద్యార్థులకు గాను 1216 మంది హాజరయ్యారైనట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ దస్తగిరి, ఎంఈఓ-2 తనిఖీ చేశారు. పామిడి మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ జయానాయక్ తెలిపారు. బెళుగుప్పలో 537 మంది కాగాను 479 మంది హాజరైనట్లు ఎంఈఓ మల్లారెడ్డి తెలిపారు. యాడికిలో 772 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద చవ్వా ఆదినారాయణ ట్రస్ట్ ఆధ్వర్యంలో తాగునీటిని అందించారు. డీ హీరేహాళ్ మండలంలో 635 మందికి గాను 605 మంది పరీక్షలు రాసినట్లు అధికారులు తెలిపారు. 30 మంది గైర్హాజరైనట్లు వారు తెలిపారు. పుట్లూరులో 365 మంది గాను 341 మంది పరీక్షలు రాసినట్లు అధికారులు తెలిపారు. అలాగే యల్లనూరులో 278 మందికి గాను 273 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ గురుప్రసాద్ తనిఖీ చేశారు. రాయదుర్గం పట్టణంలో 1642 మంది విద్యార్థులకు గాను 1507 మంది పరీక్షలు రాసినట్లు ఎంఈఓ నాగమణి తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఆర్జేడీ రాఘవరెడ్డి తనిఖీ చేశారు. పెద్దపప్పూరు మండలంలో 469 మందికి గాను 432 మంది హాజరైనట్లు ఎంఈఓ శ్రీదేవి తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎస్ఐ శరత్‌చంద్ర బందోబస్తు నిర్వహించారు. తాడిపత్రి పట్టణంలో 9 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 2774 మంది విద్యార్థులకు 2723 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. అలాగే పెద్దవడుగూరులో555 మంది విద్యార్థులకు గాను 60 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ రాముడు తెలిపారు.

\- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



రాయదుర్గంలో రూమ్ నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు



గుంతకల్లులో పరీక్ష హాల్‌కు వెళుతున్న విద్యార్థులు



తాడిపత్రిలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు



ఉరవకొండలో...